ఉన్నత చదువు.. పోలీస్ కొలువు

బీటెక్.. ఎంటెక్.. ఎంఫార్మసీ..ఎంబీఏ వంటి కోర్సులు చదివిన వారు కార్పొరేట్ ఉద్యోగాలకు వెళ్లకుండా కానిస్టేబుల్ ఉద్యోగాల వైపు మళ్లారు. మల్టీనేషనల్ కంపెనీలు ఆహ్వానిస్తున్నా.. గవర్నమెంట్ నౌకరీపై మక్కువతో పరీక్షలు రాశారు. ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఉన్నత విద్యావంతులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో తల్లిదండ్రుల కల నెరవేర్చిన వారు కొందరైతే.. పరిస్థితులతో ఇటు వైపు వచ్చిన వారు మరికొందరు.. - 8లో▸



న్యూస్‌రీల్

డ్రాగన్‌ఫ్రూట్ రైతుకు కలెక్టర్ అభినందనలు



సిరిసిల్లఅర్బన్: సాంప్రదాయ పంటల స్థానంలో లాభదాయక డ్రాగన్‌ఫ్రూట్ సాగుచేస్తున్న బోయినపల్లి మండలం రత్నంపేటకు చెందిన రైతు కొడగాని సత్యంను కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించారు. తాను సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్స్‌ను కలెక్టర్‌కు శనివారం అందజేశారు. సాగువిధానం, మార్కెటింగ్ తదితర అంశాల గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్లో డ్రాగన్ ఫ్రూట్స్‌కు డిమాండ్ ఉందని, సాగులో మెలకువలు పాటిస్తే దీర్ఘ కాలం ఆదాయం పొందవచ్చని రైతు తెలిపారు. జిల్లాలోని రైతులకు వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానవన అధికారులకు కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఉద్యానవన అధికారి జ్యోతి, డీపీఆర్వో దశరథం ఉన్నారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

- జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత



సిరిసిల్లటౌన్: మహిళలు మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండాలని జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత కోరారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థులతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. 2017 యాక్టు ప్రకారం శారీరక, మానసిక ఆరోగ్యం జీవన విధానంలో ఒక భాగమన్నారు. మహిళలపై పెరుగుతున్న ఆకృత్యాలు, హింస నిరోధానికి మానసిక ఆరోగ్యంగా ఉండడం ముఖ్యమన్నారు. మహిళల రక్షణకు ఉచిత న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, లోక్ అదాలత్ మెంబర్ చింతోజు భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, న్యాయవాదులు పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కోసం రాస్తారోకో



వేములవాడ: అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం వేములవాడలో రెండో బైపాస్‌రోడ్డులో రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల కోసమే పట్టణంలో సర్వే చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు ఇతర పార్టీ నాయకులను కొనుగోలు చేస్తూ ప్రజలకు ఏదో అభివృద్ధి చేస్తున్నట్టు మాయ చేస్తున్నారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి శ్రీనివాస్, నాయకులు గడ్డమీద శ్రీనివాస్, పిన్నింటి హన్మండ్లు, గుడిసె మనోజ్, రేగుల రాజ్‌కుమార్, మేర్గు లక్ష్మణ్, మైలారం శ్రీనివాస్, బిళ్ల కృష్ణ, కొప్పెర సంతోష్‌రెడ్డి, కోరెపు నరేశ్ పాల్గొన్నారు.

'డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి'

కోనరావుపేట(వేములవాడ): త్వరలోనే కోనరావుపేట మండలానికి వస్తున్న సీఎం కేసీఆర్ స్థానిక విద్యార్థుల కోసం డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. ఏటా మండలం నుంచి వందలాది మంది విద్యార్థులు డిగ్రీ చదువు కోసం సిరిసిల్ల, వేములవాడకు వెళ్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ ఉన్నా డిగ్రీ కళాశాల తేవడంలో విఫలమయ్యారన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. సాయి, నరేశ్, వెంకటేశ్, దివాకర్, రాజు, చందు తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

సిరిసిల్లఅర్బన్: డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ప్రకటనలో కోరారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోపు స్టడీసర్కిల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 93818 88743లో సంప్రదించాలని తెలిపారు.

చేప పిల్లలు ఎక్కడ?

- అదును దాటుతోంది
- చెరువుల్లోకి చేరని చేపపిల్లలు
- లక్ష్యం 1.41 కోట్లు.. పంపిణీ చేసింది 58.73 లక్షలు
- నగం లక్ష్యం దాటని పంపిణీ
- మత్స్యకార సొసైటీలకు ఎదురుచూపులే దిక్కు



నర్మాల ఎగువమానేరు జలాశయం

గంభీరావుపేట(సిరిసిల్ల): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేపపిల్లల పంపిణీ లక్ష్యం చేరడం లేదు. ఏటా మత్సకార సొసైటీలకు ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లలు ఈసారి జిల్లాలోని సగం చెరువుల్లోకి కూడా చేరలేవు. వానాకాలం ప్రారంభంలోనే చెరువుల్లోకి చేపపిల్లలను వదిలే అధికారులు ఈసారి అక్టోబర్ వచ్చినా లక్ష్యం సగం చేరుకోలేదు. ప్రభుత్వమే అందిస్తుందని ఎదురుచూసిన మత్స్యకార సొసైటీలకు నిరాశ ఎదురవుతుంది. ఆలస్యం కావడంతో జిల్లాలో పలు సొసైటీలకు సొంతంగా కొని చెరువుల్లో వదులుకున్నారు. జిల్లాలోని ఎగువమానేరు, మధ్యమానేరుతోపాటు గ్రామాల్లోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఈసారి ఎక్కువ పిల్లలను పంపిణీ చేస్తే ఆర్థికంగా అండగా ఉంటుందని భావించిన సొసైటీలకు అధికారుల నిర్లక్ష్యంతో నిరాశ ఎదురైంది.

సమస్యలెన్నో..

చెరువుల్లోకి చేపపిల్లలు వదిలిన తర్వాత అవి పెరిగి పెద్దవై చనిపోవడం చాలా చోట్ల కనిపిస్తోంది. దానికి కారణాలెంటో అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. వాతావరణంలో మార్పులు ఒకటైతే.. కొన్ని గ్రామాల్లో చెరువులు నివాసాలకు దగ్గరగా ఉండడంతో డ్రెయినేజీ నీరు చెరువుల్లో కలుస్తుండడంతో కలుషితమై చేపలు చనిపోతున్నాయి. అంతేగాకుండా ఆశించిన స్థాయిలో దిగుబడి కూడా రావడం లేదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా చెరువులో వదిలిన 35–40 ఎంఎం సైజు చేపపిల్ల కిలో బరువు పెరగాలంటే నీటి నాణ్యత, లభించే ఆహారం బట్టి దాదాపు పది నెలల సమయం పడుతుంది. ఎక్కువ చెరువుల్లో మార్చి నాటికే నీటి స్థాయి గణనీయంగా పడిపోతుంది. ఫలితంగా చేపల్లో ఎదుగుదల లోపించే అవకాశం ఉంది. జలాశయాల్లో పేరుకుపోయిన ఫంగస్, బ్యాక్టీరియా కారణంగా వ్యాధులు సోకే ప్రమాదం కూడా ఉంది. వీటన్నింటిని తట్టుకొని ఎంతో కొంత ఎదిగిన చేపలు కూడా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో నీటి వేడిమిని తట్టుకోలేక చనిపోయి మత్స్యకారులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి.

1.41 కోట్ల లక్ష్యం

జిల్లాలో 116 మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. వీటిలో 104 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, పది మహిళా మత్స్యపారిశ్రామిక సంఘాలు, రెండు ప్రాథమిక మత్స్య మార్కెటింగ్ సొసైటీలు ఉన్నాయి. ఆయా సొసైటీల్లో 7,880 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలోని 440 సొసైటీ చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో ఒక కోటి 41 లక్షల 15వేల చేప పిల్లలను వందశాతం సబ్సిడీపై పంపిణీ చేయాలన్నది మత్స్యశాఖ లక్ష్యం. గతేడాది కంటే ఈసారి మూడు లక్షల చేపపిల్లల పంపిణీ లక్ష్యం పెరిగింది. ఇప్పటి వరకు మిడ్‌మానేరు జలాశయంలో 80–100 ఎంఎం సైజులోని 3 లక్షల 84వేల చేప పిల్లలను, 142 చెరువులు, కుంటల్లో 35–40 ఎంఎం సైజులోని 25 లక్షల 43వేల చేప పిల్లలను వదిలారు. జిల్లాలోని మూడు ప్రాజెక్టుల్లో 29 లక్షల 46వేల రొయ్య పిల్లలను పంపిణీ చేశారు.

వేగవంతం చేయాలి



ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో చేపపిల్లల పంపిణీని వేగవంతం చేయాలి. ఇప్పటికే చేపపిల్లల పంపిణీ ప్రక్రియ మొదలైంది. అయినా అధికారులపై ఒత్తిడి పెంచి ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తాం.

– గాడిచర్ల శ్రీనివాస్, జిల్లా మత్స్యకార సొసైటీ డైరెక్టర్

మాకు సమాచారం లేదు



ఈసారి చేపపిల్లల పంపిణీ గురించి మాకు సమాచారం లేదు. ఇప్పటి వరకు చేపపిల్లలను చెరువుల్లోకి వదిలారో.. లేదో తెలియదు. త్వరగా చెరువుల్లోకి వదిలితే బాగుంటుంది. ఈ కార్యక్రమాల్లో సొసైటీ సభ్యులను, పెద్దలను భాగస్వాములను చేయాలి.

– నాగారపు దేవేందర్, మత్స్యకార సొసైటీ చైర్మన్, గంభీరావుపేట

20 వరకు పూర్తి చేస్తాం



ఈసారి చేపపిల్లల పంపిణీని ఈనెల 20 వరకు పూర్తి చేస్తాం. మత్స్యశాఖ నిర్ణయించుకున్న కోటి 41 లక్షల 15 వేల చేపపిల్లల పంపిణీ లక్ష్యం నెరవేరుస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వచ్చిన చేపపిల్లలను మాత్రమే చెరువుల్లో వదులుతాం. నాణ్యత, సైజులను పరిశీలిస్తున్నాం.

– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

రాజన్న ఆదాయం రూ.1.68 కోట్లు



వేములవాడ: వేములవాడ రాజన్నకు హుండీల ద్వారా రూ.1.68 కోట్ల ఆదాయం వచ్చింది. నగదుతోపాటు 242 గ్రాముల బంగారం, 13 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో ప్రతాప నవీన్ తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య శనివారం గుడిలోని ఓపెన్ స్లాబ్‌లో హుండీ లెక్కింపు చేపట్టారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట



సిరిసిల్లటౌన్: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. శనివారం నర్సింగ్ కాలేజీ ప్రాంగణంలో సిరిసిల్ల నియోజకవర్గంలోని ట్రైస్కూటర్స్ లబ్ధిదారులకు వాహనాలు అందించారు. దివ్యాంగులు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ నెలకు రూ.4,016 పెన్షన్ అందిస్తున్నారన్నారు. అందరి కష్టాలు తెలిసిన వ్యక్తిలా సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాలకు సముచిత న్యాయం చేస్తున్నారని పేర్కొన్నా రు. జిల్లాలో 11,968 మంది దివ్యాంగులకు పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 375 మందికి ట్రైస్కూటర్స్ అందించా మన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, ఎంపీపీ పడిగెల మానస, ఇన్‌చార్జి సీడీపీవో దివ్య పాల్గొన్నారు.

పోలీస్, ఎక్సైజ్ సమన్వయంతో పనిచేయాలి

- ఎస్పీ అఖిల్‌మహాజన్



ఎక్సైజ్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

సిరిసిల్లఅర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సివిల్, ఎక్సైజ్ పోలీసులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. తన ఆఫీస్‌లో శనివారం ఎక్సైజ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నాటుసారా తయారీ, రవాణా, సేవించే ప్రాంతాలపై దృష్టి సారించాలన్నారు. సారా ముడి పదార్థాలు అమ్మే వారిని గుర్తించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి రవాణాను అడ్డుకోవాలన్నారు. ఎక్సైజ్ సీఐలు ఎంపీఆర్ చంద్రశేఖర్, గులామ్ ముస్తఫా, గుండేటి రాము ఉన్నారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. అవసరాల కోసం లోన్ యాప్‌లను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. నకిలీ లాటరీ, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, లోన్‌యాప్, పింక్‌వాట్సాప్ పేరుతో మోసం చేస్తున్నారని హెచ్చరించారు. సైబర్ నేరాలకు గురయితే టోల్ ఫ్రీ 1930, డయల్ 100 నంబర్లకు సంప్రదించాలన్నారు.

రోజంతా కరెంట్‌కట్

- చీకట్లో ఎల్లారెడ్డిపేట
- ఇబ్బందుల్లో మండల కేంద్రం వాసులు



అంధకారంలో ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం రోజంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి వేళ కూడా ఆలస్యంగా కరెంట్ రావడంతో మండల కేంద్రం వాసులు అంధకారంలోనే గడిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు పనులు కొనసాగుతున్నాయనే కారణంతో ముందస్తు సమాచారం ఇవ్వకుండానే కరెంట్ కోతలు విధించడంపై విమర్శలు వస్తున్నాయి. టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావుతోపాటు ఉన్నతాధికారులు గురువారం సందర్శించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే వారు వచ్చి వెళ్లిన తర్వాత రోజునే కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంపై స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు, శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు ముందస్తు సమాచారం లేకుండా కరెంట్ సరఫరాను నిలిపివేశారు. ఈ విషయంపై స్థానిక ఏఈని వివరణ కోరగా.. సబ్‌స్టేషన్‌లో ఏదో మరమ్మతు పనులు చేస్తున్నారని, ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. లోకల్‌గా పనిచేసే సిబ్బందికి చెప్పకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై పలు ఆరోపణలు వచ్చాయి.

కొనసాగుతున్న నిరసనలు



సిరిసిల్లటౌన్: ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్డీవో ఆఫీస్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం కొనసాగింది. డీఈవో ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, మధ్యాహ్న కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మీస లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మి, సత్తయ్య, సావిత్రి, మల్లవ్వ, నర్సయ్య, మంజుల, రేణుక, కనకలక్ష్మి ఉన్నారు.

ముగ్గులతో నిరసన

ప్రభుత్వం స్పందించడం లేదంటూ ఈ పంచాయతీ వర్కర్లు వినూత్నంగా దీక్షాశిబిరంలో ముగ్గులు వేసి నిరసన తెలిపారు. ప్రాజెక్టు మేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లకు పేస్కేలు అమలు చేయాలని కోరారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ స్వామి, శేషాద్రి, శ్రీధర్, శాణగొండ రమేశ్, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట ఈ పంచాయతీ వర్కర్లు మద్దతు తెలుపుతూ ఆర్థిక సాయం చేశారు.

సంకెపల్లిలో 45 ఇళ్లకు పరిహారం

వేములవాడఅర్బన్: మండలంలోని సంకెపల్లిలోని ముంపునకు గురవుతున్న 45 ఇళ్లను ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో తీసుకోవాలని, వాటికి సంబంధించిన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు తెలిపారు. సహకరించిన మంత్రి కేటీఆర్, ప్లానింగ్ కమిషన్ వైస్‌చైర్మన్ బి.వినోద్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మోసపోతే గోస పడతాం



మాట్లాడుతున్న వినోద్‌కుమార్, వేదికపై ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దాం
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

వేములవాడ: ఎన్నికల సమయంలో ఏవేవో హామీలు ఇస్తూ..మోసం చేసేందుకు వస్తున్నారని.. ఇప్పుడే జాగ్రత్తగా ఉండాలని.. మోసపోతే గోసపడతామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసి మన ఫలాలను మనమే అనుభవించేలా చేసుకోవాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం తప్ప వేరే పనులు లేవని ఎద్దేవా చేశారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలకు ఎత్తిపోతల పథకాలే శరణ్యమని చెన్నమనేని రాజేశ్వర్‌రావు అన్న మాటలు నేడు సాకారమయ్యాయని.. అందుకే మల్కపేట రిజర్వాయర్‌కు ఆయన పేరు పెట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు కృషితో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. రూ.52 కోట్లతో బ్రిడ్జీలు, వేములవాడలో రూ.35 కోట్లతో రోడ్ల విస్తరణ చేపట్టబోతున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మాధవి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ బూర వజ్రవ్వ, జెడ్పీటీసీలు రవి, వాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాల పంపిణీ

రూ.15 కోట్ల విలువైన వేములవాడ పట్టణం, రూరల్ అర్బన్ మండలాలకు చెందిన 450 లబ్ధిదారులకు గృహలక్ష్మి నిర్మాణపత్రాలు, 100 మందికి రూ.లక్ష చొప్పున రూ.కోటి విలువైన బీసీబంధు చెక్కులు, రూ.2.30 కోట్ల విలువైన ఎస్‌డీఎఫ్ నిధుల ప్రొసీడింగ్స్, 35 స్పోర్ట్స్ కిట్స్, 15 మంది వికలాంగులకు స్కూటీలను అందజేశారు.


గోశాలకు రాజన్న కోడెలు




వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను జనగామ జిల్లా దేవరపల్లె మండలం పద్మావతి తండాకు చెందిన పరమేశ్వర గోశాలకు అందించారు. ఇందులో ఎనిమిది ఆవులు, రెండు కోడెలు ఉన్నాయి. ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ తదితరులు ఉన్నారు.

సింగాపూర్ నుంచి వచ్చిన మూడు రోజులకే..

రోడ్డు ప్రమాదంలో తమ్ముడు మృతి, అన్నకు తీవ్ర గాయాలు




దిలీప్‌రెడ్డి (ఫైల్)



గాయపడ్డ అనిల్‌రెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సింగాపూర్‌లో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్న చిన్న కొడుకు ఇంటికొచ్చాడన్న సంతోషం ఎక్కువ రోజులు నిలువలేదు. రోడ్డు ప్రమాదం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేట వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్ముడు మృతిచెందగా, అన్న తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని వెల్జిపూర్‌కు చెందిన వోరెం శివారెడ్డి–భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు అనిల్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి. చిన్న కొడుకు దిలీప్‌రెడ్డి సింగాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా మూడు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. శనివారం రాత్రి ముస్కానిపేటకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అన్న అనిల్‌రెడ్డి కాలు విరుగగా, తమ్ముడు దిలీప్‌రెడ్డి(28)కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్ తరలిస్తుండగా పరిస్థితి విషమించి దిలీప్‌రెడ్డి ప్రాణాలు వదిలాడు. ఇల్లంతకుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



సిరిసిల్లటౌన్: రాహుల్‌గాంధీని కించపరిచేలా సోషల్ మీడియాలో ఫొటోలు పోస్టు చేయడంపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, టీపీసీసీ ప్రచార కార్యదర్శి సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, సీనియర్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సూర దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముదిరాజ్‌ల ఆత్మగౌరవం చాటిచెబుదాం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సికింద్రాబాద్‌లో ఆదివారం నిర్వహించే ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌడుగు నర్సయ్య కోరారు. మండలకేంద్రంలో 'ముదిరాజుల ఆత్మగౌరవ సభ' పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. జిల్లా ఫిషరీస్ చైర్మన్ రామచంద్రం, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ చందన్, మాజీ ఎంపీటీసీ కనకయ్య, పర్శరాము, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లాలోని అన్ని హాస్టళ్లలో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్నట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్ తెలిపారు. గంభీరావుపేటలోని హాస్టళ్లలో శనివారం ఏఎంసీ స్ప్రేను పరిశీలించారు. జిల్లాలో 70 హాస్టళ్లకు 40 హాస్టళ్లలో స్ప్రే చేసినట్లు తెలిపారు. ఎస్సీ బాలికల వసతి గృహ సంక్షేమాధికారి భూదేవి తదితరులు ఉన్నారు.

డీఎం మురళీకృష్ణకు అవార్డు



వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రాఖీ, శ్రావణమాసం చాలెంజ్‌లో అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అందజేశారు.

ముగ్గురి బైండోవర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న బొమ్మనవేని దేవయ్య, అల్లె నర్సయ్య, ఆలకుంట రాజులను తహసీల్దార్ రాంచందర్ బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని దాడి చేసి పట్టుకున్నారు.

ఉన్నత చదువు.. పోలీస్ కొలువు

- జీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎం.ఫార్మసీ చదివి.. కానిస్టేబుళ్లుగా ఎంపిక
- తల్లిదండ్రుల కోరిక
- ప్రభుత్వ ఉద్యోగమంటే మక్కువ
- లక్ష్యాన్ని చేరుకున్న యువత





కరీంనగర్‌క్రైం: వారంతా.. బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎం.ఫార్మసీ వంటి ఉన్నత చదువులు చదివారు. తల్లిదండ్రుల కోరిక, ప్రభుత్వ ఉద్యోగం.. అందులోనూ పోలీస్ శాఖలో కొలువుపై మక్కువతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. చివరికి కానిస్టేబుళ్లుగా ఎంపికై, లక్ష్యాన్ని చేరుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అలాంటి అభ్యర్థులపై ప్రత్యేక కథనం.

పోలీస్ అవ్వాలనుకున్న



మాది మంచిర్యాల. నేను ఎం.ఫార్మసీ చేశాను. చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలనుకున్న. అమ్మానాన్న రజిత–ఎల్లయ్య. నాన్న అటెండర్. వారి ప్రోత్సాహంతో ఉద్యోగం కరీంనగర్‌లో శిక్షణ తీసుకున్న. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా.

– తోకల అనూష, ఎం.ఫార్మసీ

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



చిన్ననాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం చేయాలని లక్ష్యం ఉండేది. అమ్మానాన్న సత్తమ్మ–నర్సయ్య. నాన్న తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎంబీఏ చేశాను. కరీంనగర్‌లో కోచింగ్ తీసుకొని, సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– ప్రవళిక, ఎంబీఏ

అమ్మానాన్న కల



మాది అంతర్గాం మండలంలోని మద్దిరాల. నేను పోలీస్ కావాలనేది మా అమ్మానాన్న పద్మ–లింగయ్య కల. ప్రస్తుతం ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ చదువుతున్న. కరీంనగర్‌లో శిక్షణ పొంది, కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– మాటేటి సందీప్, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్

ఇది నాలుగో కొలువు



నేను ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఓయూలో పూర్తి చేశాను. ప్రస్తుతం సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. ఇది నాకు నాలుగో ప్రభుత్వ కొలువు. మొదట ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా, తర్వాత జైల్ వార్డెన్‌గా, పంచాయతీ సెక్రటరీ ఉద్యోగాలు వచ్చాయి. కానీ వెళ్లలేదు.అమ్మనాన్న, భార్య ప్రోత్సాహంతోనే సాధించగలిగాను.

– కృష్ణంరాజు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ

నాన్న స్ఫూర్తితోనే..



రామడుగు: నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. మా నాన్న హెడ్ కానిస్టేబుల్. ఆయన స్ఫూర్తితోనే నేను ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. చాలా సంతోషంగా ఉంది.

దూలుముట్టి సాహిత్‌రెడ్డి, బీటెక్

అమ్మా, తమ్ముడు చదివించారు



సైదాపూర్: నాన్న చిన్నతనంలోనే చనిపోయాడు. అమ్మ బట్టలు కుడుతూ, తమ్ముడు కూలీ పనులు చేస్తూ నన్ను ఎం.టెక్ చదివించారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ.. రెండుసార్లు మెయిన్స్‌లో ఫెయిలయ్యాను. పేదరికం కారణంగా కోచింగ్ తీసుకోకుండానే మూడో ప్రయత్నంలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– నాంపల్లి శివకుమార్, ఎం.టెక్

నాన్న పోలీస్ అవ్వాలనేవారు



మాది కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్. నాన్న తిరుపతి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2013లో గుండెపోటుతో చనిపోయారు. నాకు ఒక అక్క, చెల్లి ఉన్నారు. మాలో ఒకరు పోలీస్ అవ్వాలని నాన్న అనేవారు. నేను ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి, ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– కట్ట సాయిచైతన్య, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ

ఆనందంగా ఉంది



రుద్రంగి: మాది రుద్రంగి. అమ్మానాన్న నన్ను ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలని కలలుగన్నారు. వాటిని నిజం చేస్తూ నేను ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. వారి కోరిక తీర్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

తోకల శశిధర్, బీటెక్

పోలీస్ కావాలన్నదే కోరిక



కోరుట్ల రూరల్: మాది పైడిమడుగు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాను. ఏదో ఒకరోజు పోలీస్ కావాలన్నదే నా కోరిక. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకొని, మొదటి ప్రయత్నంలోనే ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– దొమ్మటి మణిదీప్, బీటెక్

పోలీస్ డ్రెస్ అంటే ఇష్టం



కోరుట్ల రూరల్: మాది పైడిమడుగు. నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ డ్రెస్ అంటే ఇష్టం. బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేశా. హైదరాబాద్‌లో పోలీస్ కోచింగ్ తీసుకొని, మొదటి ప్రయత్నంలోనే ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– అరిసె రోహిత్,

జైల్ వార్డెన్‌గా ఎంపికయ్యా



మల్యాల: మాది తాటిపల్లి అనుబంధ గ్రామం కొంపల్లి. అమ్మానాన్నా కమల–గంగారాం. నేను ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశాను. గ్రూప్స్‌కి సన్నద్ధమై, కానిస్టేబుల్ పరీక్ష రాసి, జైల్ వార్డెన్ ఉద్యోగానికి ఎంపికయ్యా.

– కల్లెం మహేందర్, ఎంఏ ఎకనామిక్స్

పొలం పనులకు వెళ్తూ..



ఎల్లారెడ్డిపేట: మాది అక్కపల్లి. అమ్మానాన్న రాజవ్వ–కొమురయ్య. నేను వ్యవసాయ పనులకు వెళ్తూ బీటెక్ వరకు చదివా. అమ్మానాన్న కష్టం చూసి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకున్న. పట్టుదలతో చదివి, సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా.

– మమత, బీటెక్

ప్రైవేటు ఇంజినీర్‌గా పనిచేస్తూ..



రుద్రంగి: మాది రుద్రంగి. నేను బీటెక్ చదివాను. ప్రైవేటు ఇంజినీర్‌గా పనిచేస్తూనే పోలీస్ ఉద్యోగం అంటే ఇష్టంతో ఎస్సై పోస్టుకు దరఖాస్తు చేశాను. రెండు మార్కుల తేడాతో ఆ ఉద్యోగం కోల్పోయాను. ప్రస్తుతం ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– బాసని సూర్యప్రకాశ్, బీటెక్

నాన్న కోరిక..



బోయినపల్లి(చొప్పదండి): మాది తడగొండ గ్రామం. నేను బీటెక్ చదివాను. నాన్న తిరుపతిరెడ్డికి నేను ఎస్సై కావాలని కోరిక. ఇటీవల ఎస్సై పరీక్షా ఫలితాల్లో కొద్దిలో జాబ్ మిస్సయ్యాను. ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది.

– గోగూరి సాయికృష్ణారెడ్డి, బీటెక్

ప్రభుత్వ ఉద్యోగం చేయాలని..



చందుర్తి(వేములవాడ): మాది మల్యాల గ్రామం. నేను ఎంబీఏ పూర్తి చేశాను. నాన్న నర్సయ్య వ్యవసాయం, అమ్మ లక్ష్మి బీడీలు చేస్తున్నారు. రెండేళ్లుగా ఓ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న. ప్రస్తుతం కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

– మేరుగు ఉదయ్, ఎంబీఏ

అనుకోకుండా వచ్చింది



నాన్న నారాయణ, అమ్మ లక్ష్మి. చిన్నవ్యాపారం చేస్తడు. గోదావరిఖనిలో పోలీసు ఉద్యోగం శిక్షణ తీసుకున్న. కానీ, అనుకోకుండా ఐటీ, కమ్యూనికేషన్ సెల్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. హ్యాపీగా ఉంది.

– ఈర్ల సాయికిరణ్, బీటెక్(ఎలక్ట్రానిక్స్), మల్యాలపల్లి

సివిల్స్ సాధిస్త



నాన్న శ్రీనివాస్ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుడు. అమ్మ మమత. సివిల్స్‌లో జాబ్ కొట్టాలని నా ఆశ. చాలా ప్రిపేర్ అయ్యా. కానీ గ్రూప్–1 వాయిదా పడింది. ఇప్పుడు ఓపెన్ కేటగిరీలో ఫైర్ విభాగంలో ఉద్యోగం వచ్చింది. ఈ కొలువు చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేరవుత.

– గుంటుకు వివేక్, బీటెక్ (మెకానికల్), గోదావరిఖని

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం వదిలి..



ఎల్లారెడ్డిపేట: మాది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం. అమ్మానాన్న వరలక్ష్మి–కుబేరస్వామి. నేను ఎంటెక్ పూర్తి చేశాను. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న. నాన్న ప్రభుత్వ టీచర్. నేను ఉద్యోగం వదిలేసి, ఇంటి వద్దే చదివి, సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. – సాయిరామకృష్ణ, ఎం.టెక్

మొదటి ప్రయత్నంలోనే..



వేములవాడరూరల్: మాది చెక్కపల్లి. నేను ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. ప్రభుత్వ, బ్యాంకు ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతుండగా కానిస్టేబుల్ నోటిఫికేషన్ వచ్చింది. దీంతో సన్నద్ధమై, మొదటి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– మెతుకు మమత, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్

ఎస్సై కొలువు లక్ష్యం



కోల్‌సిటీ: నాన్న మల్లయ్య మేస్త్రీ, అమ్మ లక్ష్మి గృహిణి. గోదావరిఖనిలో మూడు నెలల శిక్షణ తీసుకున్న. ఎస్సై జాబ్ కోసం పరీక్ష రాస్తే రాలేదు. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన. చాలా సంతోషంగా ఉంది. ఎలాగైనా ఎస్సై కొలువ సాధిస్త.

– తడకపెల్లి అనిల్‌కుమార్, బీటెక్(మెకానికల్), తేలుకుంట, జూలపల్లి

అన్నయ్య స్ఫూర్తితో..



కోల్‌సిటీ: నాన్న ధర్మారావు రైతు. అమ్మ లక్ష్మి గృహిణి. అన్నయ్య సివిల్ కానిస్టేబుల్. అన్నయ్య స్ఫూర్తితో పోలీస్ కొలువు సాధించాలనేది లక్ష్యం. తొలిప్రయత్నం విఫలమైంది. మరింత పట్టుదలతో రెండోసారి సివిల్ కానిస్టేబుల్ కొలువు సాధించిన.

– కొమ్మరినేని ధర్మేందర్‌రావు, బీకాం కంప్యూటర్స్, ముస్త్యాల

ప్రభుత్వ విద్యార్థులకు ఫార్మా ఉద్యోగాలు

సిరిసిల్లకల్చరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెదిన ఐదుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఉద్యోగంతోపాటు మూడేళ్ల డిగ్రీ పూర్తి చేయడానికి అవసరమైన ఆర్థిక వనరులను సైతం కంపెనీ సమకూరుస్తుందని డీఐఈవో మోహన్ తెలిపారు.

తండాల సమగ్రాభివృద్ధికి కృషి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, పట్టణాలకు దీటుగా తండాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. మండలంలోని దేవునిగుట్టతండాలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన జీపీ భవనాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ పెంటయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, నాయకులు మల్లారెడ్డి, అందె సుభాశ్, బాల్‌రెడ్డి, లక్ష్మణ్, సతీశ్‌నాయక్ పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో వలసకార్మికుడికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: పెద్దూరులో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వలస కార్మికుడు గాయపడ్డాడు. పెద్దూరు స్పిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేస్తున్న లేబొట్ పాట్లలో బిహార్‌కు చెందిన షర్పత్ అలీ పనిచేస్తున్నాడు. శనివారం పనిలో భాగంగా ఇనుప పైపులను తీస్తున్న సమయంలో పక్కనే ఉన్న విద్యుత్‌తీగలకు తగిలి కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

యువకుని ఆత్మహత్య

కోనరావుపేట(వేములవాడ): ఒంటరితనం భరించలేక మండలం మామిడిపల్లికి చెందిన కులేరు శ్రీనివాస్(22) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన దేవయ్య–జ్యోతి దంపతుల కుమారుడు శ్రీనివాస్ పదోతరగతి వరకు చదువుకుని, కూలీ పనులు చేస్తున్నాడు. ఒంటరితనం భరించలేక ఇంటి వద్ద ఉన్న బాత్‌రూమ్‌లో శనివారం ఉరివేసుకున్నాడు. గతంలోనూ డీజిల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మృతుని తండ్రి దేవయ్య ఫిర్యాదుతో ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

సిరిసిల్లఅర్బన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గులామ్ ముస్తఫా తెలిపారు. పట్టణానికి చెందిన ఎండీ నయీం నాందేడ్ నుంచి గంజాయిని తెచ్చి గాంధీనగర్‌కు చెందిన చింతకుంట సంతోష్‌కు సివిల్ హాస్పిటల్ వద్ద విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వీరి నుంచి 36 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జైలుకు తరలించినట్లు సీఐ వివరించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజ, సిరిసిల్ల ఎక్సైజ్ ఎస్సై ముకుంద శేఖర్, రాజేందర్, సిబ్బందిని అభినందించారు.

అనుచిత పోస్టులు చేస్తే కఠిన చర్యలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, మార్ఫింగ్ వీడియోలు పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ హెచ్చరించారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. వాట్సాప్ మార్ఫింగ్ వీడియో పోస్టు చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తిప్పారం గ్రామానికి చెందిన దమ్మని బాబు ఫిర్యాదుతో బెజ్జంకి మండలానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆరు గ్యారంటీలు మా బాధ్యత

- ఏఐసీసీ సెక్రటరీ, కేరళ ఎమ్మెల్యే విష్ణునాథ్
- వేములవాడలో గడపగడపకు ప్రచారం
- ప్రధాని దిష్టిబొమ్మ దహనం



వేములవాడలో ఆరు గ్యారంటీలపై ప్రచారం చేస్తున్న విష్ణునాథ్, ఆది శ్రీనివాస్

వేములవాడ/సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసే బాధ్యత మాదే అంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో శనివారం గడప గడపకు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సెక్రటరీ, కేరళ ఎమ్మెల్యే విష్ణునాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. రాహుల్‌గాంధీపై ట్విట్టర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్‌చౌక్‌లో మోదీ చిత్రపటాన్ని దహనం చేశారు. అంతకుముందు రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక త్రినేత్ర ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. నిత్యం ప్రజలతో ఉండే ఆది శ్రీనివాస్‌ను గెలిపించాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగంకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, మండలాల అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, పిల్లి కనకయ్య, వకుళాభరణం శ్రీనివాస్,నాగరాజు, ఫిరోజ్, రామస్వామి, నరేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, జలపతి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు చావుదెబ్బే

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి చావుదెబ్బ ఖాయమని విష్ణునాథ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని డీసీసీ ఆఫీసులో ప్రెస్‌మీట్లో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు గ్యారంటీలు పక్కాగా అమలవుతున్నాయని, ఇక్కడ కూడా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ప్రధాని ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తానని వేయలేదని, రాజన్న ఆలయం అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు ఇస్తామన్న సీఎం కేసీఆర్ దేవుడిని మోసం చేశారన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, వెల్ముల స్వరూప ఉన్నారు.

ఆశల బతుకమ్మ



సిరిసిల్లటౌన్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఆశావర్కర్లు శనివారం బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. మూశం రమేశ్, కోడం రమణ, ఆశావర్కర్ల నాయకులు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య ఉన్నారు.